సాక్షి అనకాపల్లి

బుధవారం, 29, నవంబర్, 2023



వరి పైరు జాగ్రత్త 8లో

భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున కోత కోసిన వరి పైరును కాపాడుకోవాలని ఆర్‌ఏఆర్‌ఎస్ ఏడీఆర్ జగన్నాథరావు సూచించారు.



దల్లమాంబ జాతర 8లో

దల్లమాంబ జాతరలో వెదుళ్ల సంబరం ఆకట్టుకుంది. వెదుళ్లను ఇంట్లో ఉంచుకుంటే మంచి జరుగుతుందని భక్తుల నమ్మకం.

వాతావరణం

అనకాపల్లిటౌన్: రాగల ఐదురోజులు వాతావరణం పొడిగా ఉంటుందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ శాస్త్రవేత్త ఎంజీజీఎస్ కుమారి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గరిష్ట ఉష్ణోగ్రతలు 30.5 నుంచి 31.8 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 23.0 నుంచి 24.2 డిగ్రీలు, గాలిలో తేమ 64–79 శాతం, గాలి గంటకు 9–18 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉందన్నారు.

న్యూస్‌రీల్

అపరిశుభ్రతపై డీఈవో ఆగ్రహం

- ఉన్నత పాఠశాలల ఆకస్మిక తనిఖీ
- మధ్యాహ్న భోజనం తయారు చేసే చోటు శుభ్రంగా ఉండాలని ఆదేశం



కొండకర్ల హైస్కూల్లో సమ్మేటివ్ పరీక్షలు రాస్తున్న తీరుని పరిశీలిస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

అచ్యుతాపురం (అనకాపల్లి): మండలంలోని కొండకర్ల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహిస్తున్న ప్రాంతంలోని అపరిశుభ్రతపై డీఈవో వెంకటలక్ష్మమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొండకర్ల, హరిపాలెం ఉన్నత పాఠశాలలను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొండకర్లలో పరిస్థితిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలంటే వంట చేసే పరిసరాలు చాలా శుభ్రంగా ఉండాలని సూచించారు. టర్న్, లిప్ రికార్డులను పరిశీలించిన ఆమె ఉపాధ్యాయులకు, హెచ్‌ఎంలకు సూచనలిచ్చారు. సమ్మేటివ్ పరీక్షలు జరుగుతున్న తీరును ప్రత్యేకంగా పరిశీలించారు. ఆమె వెంట ఎంఈవో దేవరాయలు ఉన్నారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.2.4 కోట్లు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయం గడిచిన 42 రోజులకు గాను 2 కోట్ల 40 లక్షల 34వేల 556 వచ్చినట్టు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. సింహగిరిపై పిలిగ్రిమ్స్ సెంటర్‌లో మంగళవారం హుండీ ఆదాయాన్ని లెక్కించగా నగదుతోపాటు 148.500 గ్రాముల బంగారం, 17.700 కిలోల వెండి వచ్చినట్టు పేర్కొన్నారు. అలాగే పలు దేశాలకు చెందిన విదేశీ కరెన్సీ లభించినట్టు పేర్కొన్నారు.

అప్పన్న ఆర్జిత సేవల పునరుద్ధరణ



కంకణధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆర్జిత సేవలను మంగళవారం నుంచి పునరుద్ధరించారు. తిరునక్షత్రం పూజలు సందర్భంగా ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు ఆర్జిత సేవలన్నీ రద్దు చేశారు. తిరునక్షత్రం పూజలు ముగియడంతో తిరిగి ఆర్జిత సేవలు పునరుద్ధరించారు. మంగళవారం ఉదయం నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను మండపంలో వేంజేపచేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని అర్చకులు అందజేశారు.

దంతేవాడ వరకే కిరండూల్ రైళ్లు

తాటిచెట్లపాలెం: భద్రతాపరమైన పనుల వల్ల కొత్తవలస–కిరండూల్ లైన్‌లో నడిచే పలు రైళ్లు ఆయా తేదీల్లో దంతేవాడ వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తాయని వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ త్రిపాఠి తెలిపారు.

- విశాఖపట్నం–కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 29 నుంచి డిసెంబరు 3వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్–విశాఖపట్నం (18513) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 30 నుంచి డిసెంబరు 4వ తేదీ వరకు దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.
- విశాఖపట్నం–కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ ఈ నెల 29 నుంచి డిసెంబరు 3వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్–విశాఖపట్నం (08552) పాసింజర్ స్పెషల్ రైలు ఈ నెల 30 నుంచి డిసెంబరు 4వ తేదీ వరకు దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

పాడి పశువులకు హెల్త్ కార్డులు



హెల్త్ కార్డులు అందుకున్న పాడి రైతులతో వెటర్నరీ ఏరియా ఆస్పత్రి సహాయ సంచాలకుడు రాంబాబు

- మూగజీవాల ఆరోగ్యానికి భరోసా
- ఆర్బీకేల వారీగా కార్డుల పంపిణీ

నర్సీపట్నం: మనుషులతోపాటు పశువుల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఆరోగ్యశ్రీ కార్డుల తరహాలో పశువులకు ఆరోగ్య కార్డులు (హెల్త్ కార్డు) జారీ చేస్తోంది. పశుసంవర్ధకశాఖ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అధికారం చేపట్టిన వెంటనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పశునష్టపరిహారం పథకం ప్రారంభించింది. మరణించిన పాడి పశువులకు పరిహారం చెల్లిస్తోంది. వైఎస్సార్ పశు బీమా పథకం ద్వారా అన్ని రకాల పశువులు, జీవాలకు బీమా చేసుకునే సదుపాయాన్ని కల్పించింది. తాజాగా పశువులు, జీవాలు కలిగిన ప్రతి కుటుంబానికి యానిమల్ హెల్త్ కార్డులు చేసేందుకు ప్రభుత్వం సంకల్పించింది.

హెల్త్ కార్డులో ఏముంటుందంటే..

పశువులు, జీవాలకు వేసే వ్యాధి నిరోధక టీకాల వివరాలు, జీవాలకు నట్టల నివారణ మందుల వివరాలు హెల్త్ కార్డులో నమోదు చేస్తారు. వైఎస్సార్ పశుబీమా పథకం వివరాలను, పశువైద్య సేవలను కూడా అందులో పేర్కొంటారు. పశువులకు అత్యవసర అనారోగ్య పరిస్థితుల్లో కాల్ చేసే విధంగా 1962 టోల్‌ఫ్రీ నంబరు ఉంటుంది. పెద్ద పశువులు, జీవాలకు వేర్వేరు హెల్త్ కార్డులు జారీ చేశారు. యానిమల్ హెల్త్ కార్డులో పశువులు, సన్న జీవాలకు సంబంధించిన పూర్తి వివరాలు ఉంటాయి.

జిల్లాలో హెల్త్ కార్డుల పంపిణీ లక్ష్యం	నేటి వరకు అందించిన కార్డులు
80,979	19,611

ఏ ప్రాతిపదికన కార్డులు జారీ చేశారంటే..

2018 పశుగణన ప్రకారం జిల్లాలో ఆవులు 1,85,096, గేదెలు 2,50,402, గొర్రెలు 161641, మేకలు 180976 ఉన్నాయి. జిల్లాలో మూగజీవాలు ఉన్న కుటుంబాలు 80,979 ఉండగా నేటి వరకు 19,611 హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. ఆరు పెద్ద పశువులకు ఒక హెల్త్ కార్డు జారీ చేశారు. ఒక కుటుంబానికి 15 పశువులు ఉంటే మూడు కార్డులు ఇచ్చారు. 20 గొర్రెలు, మేకలు ఉన్న వారికి ఒకటి చొప్పున హెల్త్ కార్డు ఇచ్చారు. యానిమల్ హెల్త్ కార్డుల వల్ల కలిగే ఉపయోగాలపై పశుసంవర్ధక శాఖ అధికారులు అవగాహన కల్పించారు. ఆరు నెలలు ఆపై వయస్సు కలిగిన గొర్రెలు, మేకలు ఉండి రైస్ కార్డు కలిగిన కుటుంబాలకు 80 శాతం రాయితీలో బీమా కల్పిస్తున్నారు. మరణించిన ప్రతి జీవానికి రూ.6 వేలు చొప్పున పరిహారం చెల్లిస్తారు. ఒకటిన్నర సంవత్సరాలు పైబడిన మేలు జాతి పశువులకు ఒక్కో దానికి రూ.30 వేలు, రెండు సంవత్సరాలు పైబడిన నాటు పశువులకు రూ.15 వేలు పరిహారం చెల్లిస్తారు.

రైతులకు ఎంతో మేలు



యానిమల్ హెల్త్ కార్డులతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుంది. ఒక కుటుంబంలో రెండు పశువులు ఉన్నా హెల్త్ కార్డు ఇస్తాం. హెల్త్ కార్డుల్లో టీకాలు, నట్టల నివారణ మందుల వివరాలు ఉంటాయి. కుటుంబానికి ఒకటి చొప్పున హెల్త్ కార్డులు వచ్చాయి. ఆర్బీకే ద్వారా హెల్త్ కార్డులు అందిస్తున్నాం. నేటి వరకు 19,611 కుటుంబాలకు హెల్త్ కార్డులు పంపిణీ చేశాం.

–డబ్ల్యు.రాంబాబు, వెటర్నరీ ఏరియా ఆస్పత్రి ఏడీఏ, నర్సీపట్నం



హెల్త్ కార్డులు ఎంతో ఉపయోగం

ప్రభుత్వం పాడి రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందనడానికి ఈ హెల్త్ కార్డులే ఉదాహరణ. మూగజీవాల సంరక్షణకు సంచార వైద్యంతోపాటు బీమా పథకాలను తెచ్చింది. ప్రమాదకర పరిస్థితి వచ్చినా వెంటనే కాల్ చేసేందుకు అవసరమైన సమాచారం, పశు వ్యాధుల నిరోధానికి వేసే టీకాల వివరాల నమోదుతో హెల్త్ కార్డులు ఎంతో ఉపయోగపడతాయి.

–శెట్టి అప్పలనాయుడు, పాడి రైతు, బలిఘట్టం, నర్సీపట్నం మండలం

సెజ్‌లో సబ్ స్టేషన్‌కు సీఎం శ్రీకారం



సబ్ స్టేషన్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే కన్నబాబురాజు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి , ఎస్పీ మురళీకృష్ణ

- వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన వైఎస్ జగన్
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

అచ్యుతాపురం (అనకాపల్లి): అచ్యుతాపురం సెజ్‌లో ఏర్పాటు చేయనున్న గ్యాస్ ఇన్సులేటెడ్ సబ్ స్టేషన్ (జీఐఎస్) నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో కలిసి సీఎం తాడేపల్లి నుంచి వర్చువల్ విధానంలో ఈ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శ్రీకారం చుట్టారు. అచ్యుతాపురంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి మాట్లాడుతూ.. సెజ్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సేవల పరంగా చాలా మేలు జరగనుందని చెప్పారు. సెజ్‌లో ఏపీ ట్రాన్స్‌కో సహకారంతో రూ.875.42 కోట్లతో 400/200 కె.వి. జీఐఎస్ విద్యుత్ ఉప కేంద్రాన్ని నిర్మించనున్నట్టు చెప్పారు. ఇది రాష్ట్రంలోనే రెండో అతి పెద్ద సబ్ స్టేషన్ అని తెలిపారు. పారిశ్రామిక అవసరాలకు దోహదపడే ఈ సబ్ స్టేషన్ నిర్మాణం ద్వారా లోఓల్టేజి సమస్యను అధిగమించవచ్చన్నారు. ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి మాట్లాడుతూ సబ్ స్టేషన్ నిర్మాణం ద్వారా పారిశ్రామిక, వ్యవసాయ అవసరాలకు విద్యుత్ సరఫరాలో మేలైన సేవలందుతాయని తెలిపారు. ఎస్పీ కె.వి మురళీకృష్ణ, ఎమ్మెల్యే కన్నబాబురాజు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, ఏపీఈపీడీసీఎల్ డైరెక్టర్ రమేష్ ప్రసాద్, చీఫ్ ఇంజనీర్ నారాయణమూర్తి, అచ్యుతాపురం మండలానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నకిలీ నియామకాలపై కదలిక

- పోలీసులకు ఫిర్యాదు చేసిన కేజీహెచ్ సూపరింటెండెంట్
- సాక్షి కథనానికి స్పందన

మహారాణిపేట (విశాఖ): కేజీహెచ్‌లో నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లపై సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ చర్యలు చేపట్టారు. 'కేజీహెచ్‌లో నకిలీ నియామకాల కలకలం' శీర్షికతో 'సాక్షి' మంగళవారం కథనం ప్రచురించింది. ఈ వార్తకు స్పందించిన ఆయన నకిలీ నియామకాలపై విచారణ చేపట్టాలని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు, ఇతర వివరాలను ఫిర్యాదుకు జత చేశారు.

గౌహతిలో తెలుగువారి నుంచి అపూర్వ ఆదరణ

- అస్సాంలో పర్యటించిన ప్రభుత్వ విప్ ధర్మశ్రీ
- ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన 500 తెలుగు కుటుంబాలతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ధర్మశ్రీ

చోడవరం: గౌహతిలో ఉన్న తెలుగువారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ చెప్పారు. వ్యక్తిగత పర్యటన కోసం అస్సాం చేరుకున్న ఆయన అక్కడ ఉన్న తెలుగువారితో మంగళవారం సమావేశమయ్యారు. ఆయనకు అక్కడ ఘనస్వాగతం లభించింది. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన సుమారు 500 కుటుంబాలు అస్సాం రాష్ట్రం గౌహతిలో ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండటంతో వారి మద్దతు కోరుతూ ధర్మశ్రీ వారితో సమావేశమయ్యారు. అస్సాంలోని తెలుగువారు గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పూర్తిస్థాయిలో మద్దతు పలికారని, సార్వత్రిక ఎన్నికల్లో తమ స్వగ్రామాలకు వచ్చి ఓట్లు వేశారని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర సంక్షేమాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని, ఆ పథకాలు కొనసాగాలంటే ఉమ్మడి విశాఖలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి అంతా కృషి చేయాలని కోరారు. ఎంతో సానుకూలంగా స్పందించిన అక్కడి తెలుగువారు.. ఈసారి కూడా వైఎస్సార్‌సీపీకి పూర్తిగా మద్దతు పలుకుతామని చెప్పారని ధర్మశ్రీ తెలిపారు. వారి సమస్యలు కొన్ని తన దృష్టికి తీసుకొచ్చారని, వాటిని పరిష్కరించడానికి జిల్లాలో ఉన్న ఎంపీలు, ఎమ్మెల్యేలతో మాట్లాడతానని హామీ ఇచ్చినట్టు చెప్పారు. ప్రధానంగా గౌహతి వెళ్లే రైళ్లు అనకాపల్లి స్టేషన్‌లో ఆగకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని వారు చెప్పగా.. ఈ సమస్యను స్థానిక ఎంపీల దృష్టికి తీసుకెళతానని ధర్మశ్రీ చెప్పారు. విశాఖలో అస్సాం భవన నిర్మాణానికి స్థలం సమకూర్చాలని వారు కోరగా.. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్టు చెప్పారు. అస్సాంలో స్థిరపడ్డ కాళ్ల శ్రీనివాసరావు, మట్టా ఈశ్వరరావు, మచ్చా శంకరరావు, జి.తాతారావు తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలులో అలసత్వం వద్దు 8లో

బడుగుల ఆశాజ్యోతి పూలే



తారువ క్యాంప్ కార్యాలయంలో జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు





జ్యోతిరావు పూలే చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ

- ఆ మహనీయుడి ఆశయ సాధన దిశగా సీఎం జగన్ పాలన
- జ్యోతిరావు పూలే వర్ధంతి సభలో డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

దేవరాపల్లి: సామాజిక అసమానతలపై అలుపెరగని పోరాటం చేసి, అణగారిన వర్గాల విద్యాభివృద్ధికి మహాత్మ జ్యోతిరావు పూలే విశేష కృషి చేశారని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు కొనియాడారు. తారువ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం పూలే వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని చిత్రపటానికి డిప్యూటీ సీఎం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పూలే ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, జాతి, వర్గ, వర్ణ వివక్ష చూపకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు అందిస్తూ విప్లవాత్మక పాలన సాగిస్తున్నారని అన్నారు. పూలే స్త్రీలను విద్యావంతులుగా తీర్చిదిద్ది, వితంతు పునర్వివాహం పట్ల చైతన్యం తీసుకువచ్చి స్వయంగా వివాహాలు జరిపించారన్నారు. మహిళలు అభివృద్ధి చెందితేనే సమాజం అభివృద్ధి చెందుతుందని భావించిన మహనీయుడన్నారు.

కలెక్టరేట్‌లో..

తుమ్మపాల: మహాత్మ జ్యోతిరావు పూలే స్ఫూర్తితో అందరూ సమాజానికి సేవ చేయాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో ఆయన పూలే చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్త్రీలు, అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన విశేష కృషి చేశారన్నారు. ఆయన భార్య సావిత్రీబాయి పూలే ఆయనకు తోడుగా ఉన్నారని, వారి ఆశయాల సాధనకు అందరూ కృషి చేయాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, జిల్లా బీసీ సంక్షేమాధికారి కె.సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..

అనకాపల్లి టౌన్: మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ సమసమాజ స్థాపనకు కృషి చేయాలని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ అన్నారు. తన కార్యాలయంలో మంగళవారం పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదనపు ఎస్పీ (పరిపాలన) బి.విజయభాస్కర్, అదనపు క్రైం ఎస్పీ పి.సత్యనారాయణరావు, డీటీసీ డీఎస్పీ పి.శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, చంద్రశేఖర్, అప్పలనాయుడు, పైడపు నాయుడు, ఎస్‌ఐలు ప్రసాద్, వెంకన్న, రఘువర్మ, నాగకార్తీక్, యమున, శిరీష, సురేంద్రకుమార్ పాల్గొన్నారు.

తీరంలో రణరంగం





సాగర తీరంలో ఆకట్టుకున్న నేవీ డే సన్నాహాలు

బీచ్‌రోడ్డు (విశాఖ): ప్రశాంతమైన సాగర తీరంలో మంగళవారం సాయంత్రం యుద్ధ వాతావరణం నెలకొంది. బాంబుల మోత మోగింది. యుద్ధవిమానాలు దూసుకుపోయాయి. అదేంటి.. ఇప్పుడు ఏ యుద్ధం లేదే అనుకుంటున్నారా...? ప్రతి సంవత్సరం డిసెంబర్ 4వ తేదీన జరిగే నేవీడే సన్నాహాల్లో భాగంగా మంగళవారం నుంచి విన్యాసాలు జరుగుతున్నాయి. నిజంగా యుద్ధం జరిగితే ఎలాంటి పరిస్థితి ఉంటుందో.. అచ్చం అలాంటి వాతావరణమే ఆర్కే బీచ్‌లో సృష్టించారు. యుద్ధ సమయంలో సైనికులు ఎంత వేగంగా రెస్పాండ్ అవుతారు... శత్రు సేనలతో వీరోచితంగా ఎలా పోరాడతారో కళ్లకు కట్టినట్లు చూపించారు. హెలికాప్టర్ ద్వారా ప్రమాదంలో చిక్కుకున్న వారిని రక్షించటం, తీవ్రవాదుల దాడులను ఎదుర్కోవడం వంటివి ప్రదర్శించారు.















క్లుప్తంగా

ఇంటర్ వర్సిటీ యోగా పోటీలకు శ్రీవైష్ణవి



విద్యార్థిని శ్రీవైష్ణవిని అభినందిస్తున్న డైట్ కళాశాల యాజమాన్యం

తుమ్మపాల: ఈ నెల 26, 27 తేదీల్లో జరిగిన జేఎన్‌టీయూ, జీవీ అంతర కళాశాలల యోగా పోటీల్లో డైట్ కళాశాల ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థిని ఎం.శ్రీవైష్ణవి బంగారు పతకం సాధించినట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ బి.సిహెచ్.శ్రీనివాసరావు తెలిపారు. త్వరలో డిసెంబర్ 1 నుంచి 4వ తేదీ వరకు చెన్నై అన్నా యూనివర్సిటీలో జరగనున్న అంతర్ విశ్వవిద్యాలయాల యోగా పోటీలకు ఆమె ఎంపికైందన్నారు. శ్రీవైష్ణవిని కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, డీన్ అకాడమిక్స్ డాక్టర్ కె.పార్వతి అభినందించారు.

కోల్డ్ స్టోరేజ్ నిర్మాణ స్థలాల పరిశీలన



చీడికాడ స్థలాన్ని పరిశీలిస్తున్న రమారత్నం

చీడికాడ: వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసేందుకు వీలుగా కోల్డ్ స్టోరేజ్ నిర్మాణానికి కేటాయించిన స్థలాలను జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయ జూనియర్ ఇన్‌స్పెక్టర్ రమారత్నం మంగళవారం పరిశీలించారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ మండలంలోని చీడికాడ, అప్పలరాజుపురం గ్రామాల్లో కోల్డ్ స్టోరేజ్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రతిపాదించిందన్నారు. రెవెన్యూ అధికారులు ఒక్కో కోల్డ్ స్టోరేజ్ కోసం 35 సెంట్ల స్థలం కేటాయించినట్లు పేర్కొన్నారు. ఒక్కో స్టోరేజ్ నిర్మాణానికి రూ.46 లక్షల చొప్పున నిధులు కూడా కేటాయించినట్లు వెల్లడించారు. త్వరలో ఈ నిర్మాణాలను చేపట్టనున్నట్లు తెలిపారు.

వరి పైరు జాగ్రత్త



వరిలో మానిపండు తెగులు



సుడిదోమ సోకిన వరి పైరు

- 4న భారీ వర్షాలు పడే అవకాశం
- కుప్పలు వేసి.. లేదా నూర్చుకొని వరి పైరును కాపాడుకోవాలి
- పూతదశలో మానిపండు తెగులు వచ్చే ప్రమాదం
- ఏడీఆర్ జగన్నాథరావు సూచనలు

అనకాపల్లి టౌన్: ఈనెల 30న అల్పపీడనం ఏర్పడి డిసెంబర్ 4వ తేదీన భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున కోత కోసిన వరి పైరును కాపాడుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ పి.వి.కె.జగన్నాథరావు సూచించారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం జరిగిన శాస్త్రవేత్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుప్పలు వేసి లేదా నూర్చుకొని జాగ్రత్త చేసుకోవాలని, పూత దశలో ఉన్న వరి పైరుకు ప్రస్తుత వాతావరణ పరిస్థితుల ప్రకారం మానిపండు తెగులు సోకే అవకాశం ఉందని చెప్పారు. వరి పైరులో మానిపండు తెగులు నివారణకు లీటరు నీటికి టెబుకొనజోల్ 1 గ్రాము లేదా ప్రపికోనజోల్ 1 ఎంఎల్ చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. పూత దశలో ఉన్న పైరులో సాయంత్రం వేళలో మాత్రమే పిచికారీ చేసుకోవాలని, వరిలో సుడిదోమ గమనించినట్లయితే లీటరు నీటికి ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా బుప్రోఫిజిన్ 1.6 ఎంఎల్ చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. వరి పైరులో నీరు నిలబడినట్లయితే రెల్ల రాల్చుపురుగు ఆశించే అవకాశం ఉన్నందున.. నివారణకు లీటరు నీటికి మోనోక్రొటోఫాస్ 1.6 ఎంఎల్ చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. రబీలో వరి సాగు చేసుకొనే రైతులు స్వల్పకాలిక వరి రకాలైన ఎంటీయూ 1121, ఎంటీయూ 1156, ఎంటీయూ 1210లను ఎకరాకు 30 కిలోల వంతున విత్తుకోవాలని పేర్కొన్నారు. వరి మాగాణుల్లో తగినంత తేమ ఉన్నప్పుడు వరి కోసే 3 రోజుల ముందు విత్తనం కోసం జనుమును ఎకరాకు 15 కిలోల చొప్పున విత్తుకుంటే లాభదాయకంగా ఉంటుందని, 1 లేదా 2 తడులు ఇచ్చే సదుపాయం ఉన్నప్పుడు పెసరలో అధిక దిగుబడినిచ్చే ఐపీయూ2–14, ఎల్‌జీజీ 460 వంటి రకాలను ఎకరాకు 10–12 కిలోల వంతున విత్తుకోవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ సిహెచ్.ముకుందరావు, ఎం.బి.జి.ఎస్.కుమారి, ఆర్.సరిత, ఎ.శిరీష, వి.చంద్రశేఖర్, ఎ.అలివేణి తదితరులు పాల్గొన్నారు.

పశు సంవర్ధకశాఖ ద్వారా విశేష సేవలు

కోటవురట్ల : పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని పశు సంవర్ధకశాఖ డివిజనల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ నరసింహులు అన్నారు. బి.కె.పల్లిలో ఉచిత పశు గర్భకోశ వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. పాడి పశువులకు సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తుగా ఉచితంగానే చికిత్స అందిస్తున్నారన్నారు. అనంతరం రైతులకు యానిమల్ హెల్త్ కార్డులు, మినరల్ మిక్చర్‌ను అందజేశారు. ఈ శిబిరంలో 18 పశువులకు చూడి పరీక్షలు, 27 పశువులకు గర్భవాతం, 32 పశువులకు ఎద పరీక్షలు నిర్వహించి చికిత్స అందజేశారు.



బి.కె.పల్లిలో పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డివిజనల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ నరసింహులు

కార్యక్రమంలో ఎంపీటీసీ పెట్ల రాంబాబు, పశు సంవర్ధకశాఖ ఏడీలు సింహాద్రప్పడు, చిట్టినాయుడు, చిన్నమనాయుడు, వైద్యులు ఆశోక్, బాబూరావు పడాల్, ప్రతాప్, హరిప్రియ, మాజీ ఉప సర్పంచ్ పెట్ల వెంకటరమణ, ఏహెచ్ఏలు గోపాలమిత్రలు, రైతులు పాల్గొన్నారు.

పథకాల అమలులో అలసత్వం వద్దు

- గైర్హాజరైన అధికారులపై చర్యలు తప్పవు
- దిశ అధ్యక్షురాలు, అరకు ఎంపీ మాధవి

మహారాణిపేట: ఉమ్మడి విశాఖ జిల్లాలో పక్కాగా కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని, ఇందులో ఎటువంటి అలసత్వం చూపొద్దని జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశ) అధ్యక్షురాలు, అరకు ఎంపీ గొడ్డేటి మాధవి స్పష్టం చేశారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం కలెక్టర్ ఎ.మల్లికార్జునతో కలిసి ఆమె శాఖల వారీగా సమీక్షించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటువంటి సమీక్ష సమావేశాలకు జిల్లా అధికారులంతా తప్పకుండా హాజరు కావాలన్నారు. ప్రతీ మూడు నెలలకు ఓసారి సమీక్ష నిర్వహిస్తామని, వచ్చే సమావేశానికి అధికారులందరూ పూర్తి సమాచారంతో హాజరు కావాలని స్పష్టం చేశారు. తొలుత అటవీ, దివ్యాంగుల సంక్షేమం, నీటి పారుదల, ఐసీడీఎస్, జీవీఎంసీ, సమగ్ర శిక్ష, వైద్య ఆరోగ్యం, వ్యవసాయం, పౌర సరఫరాలు, డీఆర్‌డీఏ, డ్వామా, ఏపీఈపీడీసీఎల్ తదితర శాఖలపై సమీక్షించిన ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా శాఖల్లో పెండింగ్‌లో ఉన్న పనులను సకాలంలో పూర్తి చేసి.. లక్ష్యాలను అధిగమించాలని సూచించారు. ఆరోగ్య శ్రీ ట్రస్ట్ రిఫరల్ ఆస్పత్రుల వివరాలు అందరికీ తెలియజేయాలన్నారు. కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు, వాటికి అనుబంధంగా కొనసాగుతున్న రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్ష జరిగిందన్నారు. దిశ అధ్యక్షురాలి ఆదేశాలు, సూచనలు తప్పక పాటించాలని, వచ్చే సమావేశానికి పూర్తి సమాచారంతో హాజరు కావాలని అధికారులకు స్పష్టం చేశారు. జెడ్పీ సీఈవో ఎం.పోలినాయుడు, డ్వామా పీడీ ఇ.సందీప్, జిల్లా అటవీ శాఖాధికారి అనంత్ శంకర్, గనుల శాఖ ఉప సంచాలకుడు రాజు, సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయకర్త బి.శ్రీనివాసరావు, పంచాయతీ రాజ్ ఎస్ఈ రవీంద్ర, వ్యవసాయం, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



దిశ సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షురాలు, అరకు ఎంపీ మాధవి, చిత్రంలో కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, జెడ్పీ సీఈవో పోలినాయుడు

దుమ్మా కొట్టిన అధికారులపై ఆగ్రహం

సమీక్షకు జాతీయ రహదారులు, బీఎస్ఎన్ఎల్, రైల్వే అధికారులెవరూ హాజరు కాలేదు. పర్యాటక శాఖ జిల్లా అధికారి రాలేదు. పలు శాఖల అధికారులు హాజరు కాకుండా కింది స్థాయి అధికారులు హాజరవ్వడంతో ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. దుమ్మా కొట్టిన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. వారికి నోటీసులు జారీ చేసి వివరణ తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. తప్పనిసరి పరిస్థితుల్లో అనుమతి పొంది, బాధ్యత గల అధికారులను పంపాలని సూచించారు.

మరింత వేగంగా జగనన్న గృహ నిర్మాణాలు

- అధికారులకు కలెక్టర్, ప్రత్యేక కార్యదర్శి ఆదేశాలు



గృహ నిర్మాణ శాఖ సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి. ప్రత్యేక కార్యదర్శి దివాన్

తుమ్మపాల: జిల్లాలోని జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం గృహనిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి దివాన్ మైదీన్‌తో కలిసి ఆయన జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న కాలనీలలో విద్యుత్తు, నీటి సరఫరా, భూమిని చదును చేయడం, రోడ్లు లేకపోవడం వంటి కారణాల వల్ల ఎక్కడైనా గృహ నిర్మాణాలు నిలిచిపోతే వెంటనే తనకు తెలియజేయాలన్నారు. ప్రణాళిక ప్రకారం గృహ నిర్మాణాలు వేగంగా పూర్తి చేసేందుకు తగు చర్యలు చేపట్టాలన్నారు. హౌసింగ్ ప్రత్యేక కార్యదర్శి దివాన్ మాట్లాడుతూ జిల్లాలో గృహ నిర్మాణ పనులు బాగున్నాయని, మరింత వేగంగా పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. చెల్లింపులు ఎక్కువ కాలం పెండింగ్ లేకుండా, ఇబ్బందులుంటే తనకు తెలియజేయాలన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ కె.రమామణి, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ శాఖల ఈఈలు, జిల్లా హౌసింగ్ ఇంజినీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా దల్లమాంబ జాతర



అమ్మవారిని అలంకరిస్తున్న దృశ్యం



వెదుళ్ల సంబరం

- ఆకట్టుకున్న వెదుళ్ల సంబరం

రాంబిల్లి: ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందిన దల్లమాంబ జాతర దిమిలి గ్రామంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి జాతర సందర్భంగా నిర్వహించిన వెదుళ్ల సంబరం ఆకట్టుకుంది. పలు జిల్లాల నుంచి తరలివచ్చిన భక్తజనం దల్లమాంబ అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. పసుపు, కుంకుమలు సమర్పించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు వెదుర్లు చేతబూని సంబరంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. సంబరం ముగిశాక వెదుళ్లను ఇంటికి తీసుకెళ్లారు. దీన్ని ఇంట్లో ఉంచుకుంటే మంచి జరుగుతుందని భక్తుల నమ్మకం.

జాతర సందర్భంగా భారీ స్థాయిలో బాణసంచా కాల్చారు. బీసీటీ స్కూల్ విద్యార్థుల తప్పెట గుళ్లు, కోలాటాలు ఆకట్టుకున్నాయి. పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

కారుకు నిప్పంటించిన దుండగులు

నర్సీపట్నం: షెడ్డు బయట పార్క్ చేసిన షిఫ్ట్ డిజైర్ కారుకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. దీంతో కారు దగ్ధమైంది. వివరాలు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సమీపంలో గుర్రం శ్రీనివాస సాగర్ బైక్ మెకానిక్ షెడ్డు నిర్వహిస్తున్నాడు. సాగర్ తన కారును స్నేహితులకు ఇచ్చాడు. స్నేహితులు పని ముగించుకుని సోమవారం రాత్రి షెడ్డు బయట కారును పార్క్ చేసి వెళ్లిపోయారు. షెడ్డు బయట ఉన్న కారుకు గుర్తు తెలియని దుండగులు నిప్పంటించడంతో కారు పూర్తిగా దగ్ధమైంది. ఆ సమయంలో ఫైర్ సిబ్బంది వచ్చినప్పటికీ, అప్పటికే కారు కాలిపోయింది. దీనిపై మెకానిక్ శ్రీనివాస సాగర్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



దగ్ధమైన కారు

శ్మశాన వాటిక ఆక్రమణపై మృతదేహంతో నిరసన

- సుమారు 5 గంటలపాటు నిలిచిన అంత్యక్రియలు
- పరిష్కారం చూపిన రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం

ఎస్.రాయవరం: శ్మశానవాటిక భూమిని ఆక్రమించి, తమ వారి మృతదేహానికి అంత్యక్రియలు జరగనీయకుండా అడ్డుకుంటున్నారంటూ మృతుని కుటుంబ సభ్యులు మంగళవారం నిరసనకు దిగారు. వివరాలు. మండలంలోని గుర్రాజుపేట గ్రామంలో దళిత కాలనీలో కొమ్ము దేవుడు మంగళవారం సహజ మరణం చెందారు. దీంతో శివారులో ఉన్న శ్మశానవాటికలో అంత్యక్రియలు జరిపేందుకు తీసుకెళ్లారు. అయితే ఆ భూమి తమ తాతల కాలం నుంచి సాగు చేస్తున్నామని, శ్మశానవాటికను ఆనుకుని ఉన్న భూమిలో దహనసంస్కారాలు చేసుకోవాలంటూ గొంప వెంకన్న, లోవరాజు కుటుంబ సభ్యులు సూచించారు. దీంతో మృతుని బంధువులు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ విజయ్‌కుమార్ సిబ్బందితో గ్రామానికి వెళ్లి పరిశీలించారు. నక్కపల్లి సీఐ అప్పన్న, ఎస్.రాయవరం ఎస్ఐ ప్రసాద్ రావు సిబ్బందితో ఆందోళనకారుల వద్దకు వెళ్లారు. రైతుల ఆక్రమణ భూమిలో కొమ్ము దేవుడి మృతదేహానికి అంత్య క్రియలు చేసేందుకు గొయ్యిని తవ్వారు. దీనిపై రైతులు అభ్యంతరం లేవనెత్తారు. మృతుని కుటుంబ సభ్యులు మాత్రం అదంతా ప్రభుత్వ భూమేనని, దశాబ్ద కాలంగా శ్మశాన వాటిక కోసం ఉపయోగించుకుంటున్నట్లు తెలిపారు. అప్పటికే సంఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు ఇరువు వర్గాలకూ సర్దిచెప్పారు. ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూమికి సర్వే చేసి, హద్దులు నిర్ణయించారు. ఆక్రమణ భూమిలో ఉన్న పశువుల పాక, గడ్డిమేటను తొలగించారు. శ్మశాన భూమికి కేటాయించిన స్థలానికి హద్దులు చూపి, ఆ భూమిలో అంత్యక్రియలు చేసుకోవాలన్నారు. అదనంగా అవసరమనుకుంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కలెక్టర్‌కు నివేదించి అవసరమైన మేరకు అదనపు భూమిని కేటాయిస్తామని తహసీల్దార్ చెప్పారు. దీంతో ఆందోళనకారులు శాంతించారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తామని తహసీల్దార్ తెలిపారు. శ్మశానవాటికలో అంత్యక్రియలు అడ్డుకున్నారన్న సమాచారంతో దళిత సంఘ నాయకులు జేవీ ప్రభాకరరావు, సమతా సైనిక్ దళ్ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతుని కుటుంబ సభ్యులకు, స్థానిక దళిత సోదరులకు శాంతియుతంగా సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ విషయాన్ని కలెక్టర్‌తో చర్చించి న్యాయం జరిగేలా చేస్తామన్నారు.



ప్రభుత్వ భూమిలో పశువుల పాకను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది (ఇన్‌సెట్) శ్మశాన వాటికలో దేవుడు మృతదేహం

సామాజిక ఆస్పత్రి భవనం ప్రారంభోత్సవం నేడు

- రూ.3 కోట్లతో ఆధునిక వసతులు



ప్రారంభానికి సిద్ధమైన యలమంచిలి ఆస్పత్రి కొత్త భవనం

యలమంచిలి(అనకాపల్లి రూరల్): పట్టణ వాసుల చిరకాల వాంఛ నెరవేరనుంది. రూ.3 కోట్లతో నిర్మించిన యలమంచిలి సామాజిక వైద్య కేంద్రం నూతన భవనం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ప్రస్తుతం ఆస్పత్రి 40 ఏళ్ల క్రితం నిర్మించిన పాత భవనంలో మున్సిపల్ కార్యాలయం పక్కన కొనసాగుతోంది. భవనం శిథిలావస్థకు చేరడం, ఇరుకుగా ఉండటంతో ఈ ఆస్పత్రికి వచ్చే రోగులు, వైద్య సేవలందించే సిబ్బంది, వైద్యులు చాలా కాలంగా ఇబ్బందులు పడుతున్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ప్రజా వైద్యానికి పెద్దపీట వేసింది. ఎన్నో ఏళ్లుగా పట్టణవాసులకు తీరని కలగా ఉన్న నూతన భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఆధునిక వసతులతో కొత్త భవనం నిర్మాణంతో పాటు, 30 పడకల ఆస్పత్రిని 50 పడకల స్థాయికి పెంచుతూ ప్రభుత్వం రూ.3 కోట్ల నాబార్డు నిధులను కేటాయించింది. భవన నిర్మాణం కోసం తులసీనగర్‌లో 3 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ఏపీమెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ నిర్మాణ బాధ్యత తీసుకుంది. ప్రస్తుతం పనులు పూర్తి కావడంతో ఆస్పత్రి భవనాన్ని బుధవారం ప్రారంభించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం ఆస్పత్రి భవనాన్ని, పరిసరాలను ముస్తాబు చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే కన్నబాబు బుధవారం కొత్త భవనాన్ని ప్రారంభించనున్నారు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి పాల్గొననున్నారు.

రోడ్డు ప్రమాదంలో కొత్తకోట సీఐకు గాయాలు

రావికమతం: కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్‌కు మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్వల్ప గాయాలయ్యాయి. ప్రస్తుతం నర్సీపట్నం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కొత్తకోట మిలట్రీనగర్‌లో నివాసముంటున్న ఆయన మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి బైక్‌పై స్టేషన్‌కు బయలుదేరారు. మిలట్రీనగర్ మలుపు వద్ద రోడ్డు దాటుతుండగా అదే గ్రామానికి చెందిన ఒక దివ్యాంగ యువకుని బైక్ అదుపుతప్పి సీఐను ఢీకొంది. ఈ ప్రమాదంలో సీఐ బైక్‌తో సహా రోడ్డుపై పడిపోవడంతో స్వల్ప గాయాలయ్యాయి. అదృష్టవశాత్తూ గడ్డి, ఇసుక ప్రదేశంలో పడటంతో ప్రమాదం తప్పింది. దివ్యాంగ యువకుడిని మందలించి వదిలేసినట్లు సీఐ ఫోన్‌లో తెలిపారు.

క్లుప్తంగా

నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్'

అనకాపల్లిటౌన్: ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే..? కార్యక్రమాన్ని పట్టణంలోని సచివాలయం-10 తాకాశివీధి, మండలంలోని ఏఎంఏఎల్ కళాశాల కొత్తూరు-1 గ్రామాలలో బుధవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, ఎంపీపీ గొర్లి సూరిబాబులు మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు సచివాలయాల పరిధిలో సంక్షేమ లబ్ధి వివరాల డిస్‌ప్లే బోర్డు, పార్టీ జెండా ఆవిష్కరణ చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి గత టీడీపీ పాలన, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలన మధ్య వ్యత్యాసాలను వివరించి, సంక్షేమ పథకాల బ్రోచర్లను పంపిణీ చేస్తామన్నారు. రాత్రికి అక్కడే పల్లెనిద్ర చేసి, మరుసటిరోజు ప్రజల సమస్యలపై రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొనాల్సిందిగా కోరారు.

చింతలపాలెంలో నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్'

కశింకోట: చింతలపాలెం సచివాలయంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరణ కార్యక్రమం జరగనుందని ఎంపీపీ కలగా లక్ష్మి, ఎంపీడీవో వి.వి.రవికుమార్ తెలిపారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు, అభిమానులు, అధికారులు, సిబ్బంది హాజరు కావాలని కోరారు.

జాబ్‌మేళాలో 70 మందికి ఉద్యోగాలు



ఉద్యోగ నియామక పత్రాన్ని అందజేస్తున్న కళాశాల వ్యవస్థాపకుడు ఎం.కామరాజు

అనకాపల్లిటౌన్ : స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి శ్రీ సాయి కుల్వంత్ డిగ్రీ కళాశాల ఆవరణలో కాకినాడ కలెక్టరేట్ వికాస ఆధ్వర్యంలో మంగళవారం నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా జరిగింది. ఈ సందర్భంగా కళాశాల వ్యవస్థాపకుడు ఎం.కామరాజు మాట్లాడుతూ ఈ జాబ్‌మేళాలో ఏడు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నట్టు తెలిపారు. ఏడు కంపెనీల్లో 450 పోస్టుల భర్తీకి జాబ్‌మేళా నిర్వహించగా 140 మంది అభ్యర్థులు పాల్గొనగా 70 మందికి నియామక పత్రాలను ఆయన అందజేశారు. కార్యక్రమంలో వికాస కాకినాడ కలెక్టరేట్ అసిస్టెంట్ మేనేజర్ ఎన్.పవన్‌కుమార్, వికాస ప్లేస్‌మెంట్ ప్రతినిధులు టి.శ్రీవేణు, కె.ప్రసాద్, నిరుద్యోగులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 2,335 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,130	4,370
మొదటి రకం	3,800	4,300
రెండో రకం	3,730	4,100
మూడో రకం	3,600	3,720

అనకాపల్లి సినిమాలు

ఆదికేశవ	: రాజా
మా ఊరి పొలిమేర-2	: సత్యనారాయణస్క్రీన్-1
స్పార్క్	: సత్యనారాయణస్క్రీన్-2
జిగర్ తండ	: షిర్డిసాయి
కోటబొమ్మాళి	: పర్తిసాయి
-------	: వెంకటేశ్వర
సౌండ్‌పార్టీ	: శ్రీసత్య
మంగళవారం	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 17 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-4 యూనిట్లు, ఓ పాజిటివ్-8 యూనిట్లు, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 423 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 369 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.



ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నవ రత్నాల్లో భాగంగా అమలు చేస్తున్న 'అమ్మ ఒడి' పథకం వేలాది మంది విద్యార్థులకు ఆసరాగా నిలుస్తోంది. విద్యాభివృద్ధికి దోహదపడుతోంది. ప్రభుత్వ, ప్రైవేటు అనే తారతమ్యం లేకుండా ఏ పాఠశాలలో చదివిన విద్యార్థులకైనా ఈ పథకాన్ని అందిస్తుండడంతో బాలలు విద్యా వికాసంతో ముందుకు దూసుకుపోతున్నారు.

అమ్మఒడి లాలన
జగనన్న దీవెన



కశింకోటలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దుంగల రేవతి 9వ తరగతి చదువుతోంది. ఆమె రావికమతం మండలం అప్పన్నదొరపాలెం గ్రామానికి చెందిన సన్నకారు వ్యవసాయ కుటుంబం. కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. తల్లిదండ్రులు లక్ష్మి, తాతారావులకు ఆమె పెద్ద కుమార్తె. 6వ తరగతి చదువుతున్న చెల్లెలు ఉంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కుటుంబంలో ఒకరికే అమ్మ ఒడి పథకం వర్తిస్తుంది. ఈ మేరకు రేవతికి పథకం ద్వారా అందించే నగదు తల్లి ఖాతాకు జమ చేస్తున్నారు. కుటుంబ ఆర్థిక ఇబ్బందుల వల్ల కశింకోటలోని సమగ్ర బాలికల వసతి గృహంలో ఉంటూ స్థానిక బాలికోన్నత పాఠశాలలో నాలుగేళ్ళుగా చదువుతోంది. చదువుకు అమ్మ ఒడి చేదోడుగా నిలుస్తోంది. 6వ తరగతిలో చేరినప్పటి నుంచి (పథకం ప్రారంభమైనప్పటి నుంచి) ఇప్పటి వరకు నాలుగు దఫాలు అమ్మ ఒడి సొమ్ము లభించింది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తమలాంటి కుటుంబాలకు సీఎం జగనన్న అందిస్తున్న అమ్మఒడి ఓ వరంలా ఉపయోగపడుతోందని రేవతి కృతజ్ఞతలు వ్యక్తం చేశారు.



అమ్మ ఒడి పథకంలో లబ్ధి పొందుతున్న బాలికలు

కశింకోట మండలంలో మొత్తం పాఠశాలలు	59
ప్రాథమిక పాఠశాలలు	43
ప్రాథమికోన్నత పాఠశాలలు	3
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు	10
ఆదర్శ పాఠశాల	1
కస్తూర్బాగాంధీ విద్యాలయం	1
డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల	1
నాలుగేళ్లలో అమ్మ ఒడి లబ్ధి	రూ.47.51 కోట్లు

కశింకోట : రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో భాగంగా నవ రత్నాల్లో ఒకటైన అమ్మ ఒడి పథకాన్ని 2019-20 విద్యా సంవత్సరం నుంచి అమలు ప్రారంభించారు. దీనిలో భాగంగా మండలంలోని 59 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో కూడా అమలు చేశారు. ఈ పథకం కింద గడచిన నాలుగేళ్లలో రూ.47.51 కోట్ల రూపాయలు అందించారు. నిబంధనల మేరకు అర్హులైన ప్రతి కుటుంబంలో ఒక విద్యార్థి వంతున పథకాన్ని అందించారు. ఏడాదికి రూ.15 వేలు వంతున మధ్య దళారుల బెడద లేకుండా నేరుగా వారి తల్లి బ్యాంకు అక్కౌంటుకు నగదు బదిలీ చేసి అందిస్తున్నారు. ఏటా వేలాదిగా విద్యార్థులు ఈ పథకంలో లబ్ధి పొందుతున్నారు.

ఏటా అమ్మఒడి లబ్ధిదారుల వివరాలు ఇలా...

2019-20 (9,127 మంది), 2020-21లో (10,702), 2021-22 (6,324), 2022-23 (5,522) మంది వంతున విద్యార్థులు లబ్ధిపొందారు. ఏటా క్రమం తప్పకుండా అమ్మ ఒడి సహాయాన్ని అందిస్తుండడంతో పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఆర్థిక ఇబ్బంది తొలగి చదువులు కొనసాగించడానికి దోహదపడుతుండడంతో పేద, మధ్య తరగతి కుటుంబాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.

మూడు దఫాలుగా అమ్మఒడి



8వ తరగతి చదువుతున్న నాకు మూడు దఫాలుగా అమ్మ ఒడి అందించారు. నేరుగా పేరెంట్స్ ఖాతాలో జమ చేస్తున్నారు. ఇది మా విద్యాభ్యాసానికి ఎంతో ఉపయోగపడుతోంది.

-పెతకంశెట్టి మనస్విని, జెడ్పీ బాలికల హైస్కూలు, కశింకోట

సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సమ్మె నోటీసు

కశింకోట : మండలంలో విద్యా శాఖ సమగ్ర శిక్ష పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించడానికి సత్వరమే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేదంటే వచ్చే డిసెంబర్ నెల 2 నుంచి సమ్మె చేపట్టనున్నట్టు ఆయా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పందిరి సత్యబాబు, కార్యదర్శి ఎ.రవి, కోశాధికారి ఆర్.లక్ష్మి హెచ్చరించారు. ఈ మేరకు మండల విద్యా శాఖ కార్యాలయంలో మంగళవారం ఎంఈవో-2 కె.ఎస్.ఎన్ మూర్తికి సమ్మె నోటీసు ఇచ్చారు. తమ వేతనాలు పెంచాలని, క్రమం తప్పకుండా వేతనాలు చెల్లించాలని, ఇతర సదుపాయాలు కల్పించాలని ఈ సందర్భంగా కోరారు.



కశింకోట ఎంఈవో-2 మూర్తికి సమ్మె నోటీసు అందజేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

నేడు విద్యుత్‌కు అంతరాయం

అనకాపల్లిటౌన్ : జీవీఎంసీ రహదారి అభివృద్ధి పనుల్లో భాగంగా పట్టణ పరిధిలో విద్యుత్ స్తంభాలను మార్పుచేసేందుకు బుధవారం ఉదయం 10 నుంచి 3 గంటల వరకు నిలుపుదల చేయడం జరుగుతుందని విద్యుత్‌శాఖ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఆపరేషన్) కె.రాజశేఖర్, డి 1సెక్షన్ ఏఈ ఎం.శ్రీనివాసరావులు మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. అంజయ్యకాలనీ, శ్రీరామ్‌నగర్, లక్ష్మీదేవిపేట, మిరియాల కాలనీ, విజయరామరాజుపేట, గాంధీనగరం, ఎంఎంపీ కాలనీల్లో విద్యుత్‌ను నిలుపుదల చేయడం జరుగుతుందని, ఆయా ప్రాంతాల ప్రజలు తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

మంచి చేసిన ప్రభుత్వానికి మద్దతివ్వండి

అనకాపల్లి రూరల్ : రాష్ట్రంలో సంక్షేమ విప్లవంతో అన్ని వర్గాల ప్రజలకు మంచి చేసిన ప్రభుత్వానికి, సీఎం జగనన్నకు ప్రజలంతా మద్దతునివ్వాలని ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తూరు సచివాలయం పరిధిలో జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సచివాలయం పరిధిలో ప్రజలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాల గురించి వివరించారు. పథకాల వివరాలతో ఉన్న బోర్డును ఆవిష్కరించారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు, జెడ్పీ వైస్ చైర్మన్ భీశెట్టి వరాహ సత్యవతి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పెద్దిశెట్టి గోవింద్, జగన్‌మోహన్‌రెడ్డి, పెతకంశెట్టి శివసత్యనారాయణ జోసెఫ్, సర్పంచ్ ప్రసన్న లక్ష్మి, ఎంపీటీసీ వెలుగుల లక్ష్మి, అనపర్తి శ్రీనివాసరావు, ఎంపీడీవో కె.వి.నరసింహారావు, ఈవోపీఆర్డీ కె.ధర్మారావు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కొత్తూరులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న దంతులూరి దిలీప్ కుమార్

క్రియ పోటీల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థుల ప్రతిభ



బహుమతులు పొందిన విద్యార్థులతో విద్యా సంస్థల అధినేత నరసింహారావు

పాయకరావుపేట : ఈ నెల 25, 26 తేదీల్లో కాకినాడ జేఎన్‌టీయూలో క్రియ (రాష్ట్ర స్థాయి బాలల పండగ) అంతర్ పాఠశాలల సాంస్కృతిక పోటీల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థులు 96 మంది అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులు గెలుచుకున్నారని విద్యాసంస్థల అధినేత సిహెచ్.వి.కె నరసింహారావు తెలిపారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులను విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్ అభినందించారు.

అపూర్వ సమ్మేళనం

నర్సీపట్నం: పదీ.. ఇరవై.. కాదు. ఏకంగా 48 ఏళ్ల స్నేహ బంధం వారిది. ఇన్నేళ్లయినా వారి స్నేహం చెక్కు చెదరలేదు. దాదాపు ఐదు దశాబ్దాల క్రితం హైస్కూల్, కళాశాలలో విద్యను అభ్యసించిన మధుర స్మృతులను నెమరవేసుకున్నారు. 1971-75లో పెదబొడ్డేపల్లి ఆర్సీఎం స్కూల్, 1975-77లో నర్సీపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో మంగళవారం ఆత్మీయ కలయిక నిర్వహించారు. విద్యార్థి దశలో అనుభూతుల్ని గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. అప్పటి గురువులు రమణారావు, హరీంద్రనాథ్, రామకృష్ణరాజు, ఆనందరావులను సన్మానించి, జ్ఞాపికలు అందించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖ కవితా రచయిత ఆదిభట్ల కామేశ్వరశర్మ, సామాజిక మహిళ, అభ్యుదయ వేత్త కత్తి పద్మను ఘనంగా సన్మానించారు. కార్యక్రమాన్ని చెరుకూరి సత్యనారాయణ, సీహెచ్‌వీ సత్యనారాయణ, ఎస్‌పీపీ రాజు, బీవీ రామయ్య, కాళిదాసు, కామేశ్వరి పర్యవేక్షించారు.



గురువులతో పూర్వ విద్యార్థులు

ఆకట్టుకున్న నేలవేషాలు



ఆకట్టుకున్న నేలవేషాలు

మునగపాక : ఉత్తరాంధ్రలో పేరుగాంచిన మునగపాక శూలాల మహోత్సవంలో ఏర్పాటు చేసిన పలు నేలవేషాలు అందరినీ ఆకట్టుకున్నాయి. సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన ప్రదర్శనలు అలరించాయి. ఉత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన రెండంతస్తుల గుమ్మటం అందరినీ ఆకట్టుకుంది.

ఇంటింటా కేసీసీ రుణాల మంజూరు

డీసీసీబీ డీజీఎం అశోక్ కుమార్

పాయకరావుపేట : ప్రతి ఇంటింటా కిసాన్ క్రెడిట్ కార్డు రుణాలు అందించడం జరుగుతుందని డీసీసీబీ డీజీఎం ఎం.అశోక్ కుమార్ అన్నారు. అరట్లకోట గ్రామంలో గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడా రు. రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా పంట రుణాలు తక్కువ వడ్డీకే అందించడం జరుగుతుందన్నారు. అదే విధంగా ప్రధానమంత్రి జీవనజ్యోతి, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, జీవిత బీమా అతితక్కువ వాయిదాలకే మంజూరు చేయడం జరుగుతుందన్నారు. పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు కల్పిస్తున్న స్వల్ప, దీర్ఘకాలిక పంట రుణాలు తక్కువ వడ్డీకే అందించడం జరుగుతుందన్నారు. పీఏసీఎస్‌ల్లో బంగారు ఆభరణాలపై, భూమి తనఖాలపై రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ట్రాక్టర్లు, పాడి గెదేలు, పవర్ టిల్లర్లు అన్ని రకాల వ్యవసాయ పెట్టుబడులకు , పరికరాల కు కూడా రుణాలు అందించడం జరుగుతుందన్నా రు. ఈ సమావేశంలో డీసీసీబీ బీఎం లీలాశివజ్యోతి, అసిస్టెంట్ మేనేజర్ సునీత, పీఏసీఎస్ చైర్మన్ రాజేష్ ఖన్నా, పాల్గొన్నారు.



అరట్లకోట గ్రామస్తులతో సమావేశంలో మాట్లాడుతున్న డీజీఎం అశోక్ కుమార్

పెట్రోల్ బంక్ పనులు పరిశీలించిన డీజీఎం

పాయకరావుపేట పీఏసీఎస్‌కు హెచ్‌పీసీఎల్ నిర్మిస్తున్న పెట్రోల్ బంకును డీసీసీబీ, డీజీఎం ఎం.అశోక్ కుమార్ మంగళవారం పరిశీలించారు. మంగవరం వద్ద క్లాస్ - ఎ పెట్రోల్ బంకు నిర్మాణం జరుగుతుంది. బంకు నిర్మాణ పనులను పరిశీలించిన డీజీఎం వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఘనంగా వేమాలమ్మ తల్లి పండగ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

నర్సీపట్నం: మండలంలో వేములపూడి వేమాలమ్మ తల్లి పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పండగ సందర్భంగా ఎడ్ల బళ్ల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు వివిధ ప్రాంతాల నుండి 23 ఎడ్ల బళ్లు తరలి వచ్చాయి. పోటీలను మాజీ ఎమ్మెల్యే బోళెం ముత్యాలపాప భర్త బోళెం వెంకటరమణ ప్రారంభించారు. పోటీలు ఆద్యంతం అలరించాయి. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు.

జగనన్నతోనే అభివృద్ధి, సంక్షేమం

అనకాపల్లి టౌన్ : గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో సాధ్యమవుతోందని, స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్లలో ఏ ప్రభుత్వం చేయని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమ పథంలో ముందుకు నడిపిస్తున్నారని 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి అన్నారు. పట్టణ పరిధిలో సచివాలయం-5 లక్ష్మీదేవిపేటలో మంగళవారం ఏపీకీ జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం పార్టీ పట్టణ అధ్యక్షుడు, జోన్ జేఏసీ కన్వీనర్ మందపాటి జానకీ రామరాజు అధ్యక్షతన జరిగింది. అంతకుముందు సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆమె ఆవిష్కరించి, సచివాలయ పరిధిలో ప్రజలకు ఏ మేరకు లబ్ధి చేకూరిందో వివరించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి జగనన్న ప్రభుత్వాన్ని గెలిపించి, మరిన్ని సంక్షేమ పథకాలు అందుకోవాలన్నారు. సంక్షేమ పథకాల్లో అవినీతికి తావు లేకుండా పార్టీలకు అతీతంగా అర్హులైన లబ్ధిదారులకు నేరుగా అందిస్తున్న ఘనత జగనన్న ప్రభుత్వానికే దక్కిందన్నారు. టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీల ద్వారా అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారని పేర్కొన్నారు. లక్ష్మీదేవిపేట మల్లమ్మతల్లి గుండం వద్ద వైఎస్సార్‌సీపీ జెండాను ఆమె ఆవిష్కరించి, గడప గడపకు వెళ్లి ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే..బ్రోచర్‌ను అందజేశారు. అంతకు ముందు మహాత్మాగాంధీ చిత్రపటానికి ఆమె పూలమాలలు వేసినివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీ సుర వెంకటరమణ, జీవీఎంసీ ఏపీడీవో వి.కె.దొర, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, వైఎస్సార్‌సీపీ నేతలు బుద్ద భాస్కరరావు, మళ్ల సత్యనారాయణ, కొండలరావు, లింగేశ్వరరావు, అనురాధ, కె.శంకర్, రేబాక స్వామి, పీలా బాబు, రాంబాబు పాల్గొన్నారు.



లక్ష్మీదేవిపేటలో సంక్షేమ లబ్ధి డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి

అణగారిన వర్గాల ఆశాజ్యోతి పూలే

అనకాపల్లిటౌన్ : సమాజంలో అణగారినవర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని అటువంటి గొప్పవ్యక్తి ఆశయసాధనకు మనమంతా కృషి చేయాలని అనకాపల్లి వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు డీవీఆర్ క్యాంపు కార్యాలయంలో జ్యోతిరావు పూలే 133వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి మంగళవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కులాలకు అతీతంగా జీవన ప్రమాణాలను మెరుగుపరచుకొనేందుకు మనమంతా పాటుపడాలని ఆయన పిలుపునిచ్చారు.కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘ కార్యదర్శి బందం పైడిరాజు, ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు మొల్లి రమణబాబు, ఏపీ సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం యూత్ కార్యదర్శి చింతకాయల కొర్లయ్య, వివిధ బీసీ సంఘాల నాయకులు ఆళ్ల ప్రవీణ్‌కుమార్, సంబారు రమణ, పి.రాజు, జోన్నలకోట ఉమాశంకర్, చిందాడ కృష్ణారావు పాల్గొన్నారు.



జ్యోతీరావుపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దాడి రత్నాకర్

పాడి రైతులకు అమూల్ డెయిరీ ప్రోత్సాహం

తుమ్మపాల : అమూల్ డెయిరీ పాడి రైతులకు చక్కని ప్రోత్సాహాన్ని అందిస్తోందని డీసీసీబీ బ్యాంక్ (అనకాపల్లి) మేనేజర్ రజిని అన్నారు. మండలంలో సిహెచ్.ఎన్ అగ్రహారం పీఏసీఎస్ ఆవరణలో డీసీసీబీ బ్యాంక్ ఆధ్వర్యంలో (ఎఫ్ఎల్‌డీసీ) ఫైనాన్షియల్ లిటరేచర్ డెవలప్‌మెంట్ క్యాంపెయన్, ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యత అభివృద్ధి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విచ్చేసిన ఆమె రైతులనుద్దేశించి మాట్లాడుతూ రైతులకు అమూల్ డెయిరీ ద్వారా మిగతా అన్ని డెయిరీల కంటే 8 నుంచి 10 రూపాయల వరకు ఒక లీటర్‌కు ఎక్కువ ధర ఇస్తుందన్నారు. నూటికి 56 పైసలు వడ్డీ చొప్పున 45 వేల రూపాయలు గేదెలు, ఆవులు కొనుగోలు నిమిత్తం రుణ సదుపాయం కల్పిస్తుందని, తద్వారా వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులందరికీ ఏడాదికి 20 రూపాయలకే రూ.రెండు లక్షల ప్రమాద బీమా ఇస్తుందని అన్నారు. వ్యవసాయ పరికరాలకు కొనుగోలు నిమిత్తం ఎకరానికి ఐదు లక్షల రూపాయలు రుణ సదుపాయం అతి తక్కువ వడ్డీకి ఇవ్వడం జరుగుతుందన్నారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో సీహెచ్ఎన్ అగ్రహారం పీఏసీఎస్ ద్వారా రూ.4 కోట్లు ఆదాయం ఉంటే, 2022 -23లో రూ.8 కోట్లకు టర్నోవర్ పెరిగిందన్నారు. దీనికి సహకరించిన పాలకవర్గ సభ్యులను, అధికారులను, సంఘ సభ్యులను ఆమె అభినందించారు. ఒక్కొక్కరికి రూ.45 వేల చొప్పున 33 మందికి రూ.15.25 లక్షలు, వ్యవసాయ రుణాల కింద రూ.8.26 లక్షలు, జేఎల్‌జి గ్రూప్ లోన్ కింద రూ.3.30 లక్షలు రుణాలు పాలకవర్గ సభ్యులతో కలిసి అందించారు. పాలకవర్గ సభ్యులు ఏడుకొండలు, నారాపిని ప్రసాద్, నాగేశ్వరరావు, సర్పంచ్ గోవిందరావు పాల్గొన్నారు.



రైతులకు రుణాలను అందిస్తున్న పాలకవర్గ సభ్యులు

లింగ వివక్షను విడనాడాలి

కశింకోట : మండలంలోని తీడ గ్రామంలో జెండర్ మాసోత్సవాల్లో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. లింగ వివక్ష చూపరాదని, మగ, ఆడ పిల్లలను సమానంగా చూడాలని కోరారు. ఈ సందర్భంగా లింగ వివక్ష చూపబోమని మహిళలతో ప్రమాణం చేయించారు. మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి అవగాహన కలిగించారు. వెలుగు ఏపీఎం ఎస్. శ్రీనివావాసరావు, సీసీలు శ్రీను, రామకృష్ణ, వీవోఏలు భవాని, మణిరాజు, కార్యక్రమంలో పాల్గొన్నారు.



తీడలో లింగ వివక్షకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న స్వయం సహాయక సంఘాల మహిళలు

శరవేగంగా ఇంక్యుబేషన్ కేంద్రం పనులు

అనకాపల్లి టౌన్ : బెల్లం, పనస, చిరుధాన్యాల ఉప ఉత్పత్తుల ఇంక్యుబేషన్ కేంద్రం నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఎంపీ బి.వి.సత్యవతి అన్నారు. పట్టణంలో ఆర్ఏఆర్ఎస్‌లో నిర్మిస్తున్న ఇంక్యుబేషన్ కేంద్ర నిర్మాణాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీఎంఎఫ్ఎంఈ పథకంలో భాగంగా రూ.3.8 కోట్ల కేంద్ర నిధులతో ఈ నిర్మాణం జరుగుతుందన్నారు. రానున్న డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో రైతులకు అనేక సంక్షేమ పథకాలు అందుతున్నాయని, వ్యవసాయ రంగంలో ఇదో సరికొత్త అధ్యాయమని ఆమె అన్నారు.



ఇంక్యుబేషన్ కేంద్రం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీ సత్యవతి

తిమిరాం శివాలయంలో డిప్యూటీ సీఎం పూజలు

దేవరాపల్లి: కార్తీకమాసం సందర్భంగా మండలంలోని తిమిరాం ఉమామహేశ్వర స్వామి వారిని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు దర్శించుకున్నారు. సతీమణి రమణమ్మతో కలిసి ఉమా మహేశ్వరునికి అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. డిప్యూటీ సీఎం దంపతులకు ఆలయ అర్చకుడు పాకల కామేశ్వరరావు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. వేద మంత్రాల నడుమ ఆశీర్వాదం, అనంతరం స్వామి వారి ప్రసాదాలను అందించారు. స్థానిక జెడ్పీటీసీ కర్రి సత్యం దంపతులు, వైఎస్సార్‌సీపీ మండల యువజన అధ్యక్షుడు కర్రి సూరినాయుడు స్వామి వారిని దర్శించుకున్నారు.



శివాలయంలో పూజలు చేస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దంపతులు

సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు

మాడుగుల రూరల్: కార్తీక మాసం, మూడవ మంగళవారం సందర్భంగా సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కేజే పురం జంక్షన్ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని ఉపాలయంలో ఉన్న సుబ్రహ్మణ్య స్వామికి క్షీరాభిషేకం, పంచామృతాలతో అభిషేకాలు, నిర్వహించారు.